# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## సూర్యాపేట

5

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.137 | 199 | 226 |
| సూర్యాపేట | రూ.135 | 190 | 210 |
| నల్లగొండ | రూ.136 | 196 | 223 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 | కనిష్ఠం 21.0




వర్షానికి తార్పాలిన్ కప్పుకొని దర్శనాలకు వెళుతున్న భక్తులు(ఫైల్)

# ఆశ్రయమీయవా

● కొండపై నిలువ నీడ కరువు ● గడియసేపైనా గడపగలమా? ● తులసీకాటేజ్‌లోనే దేవస్థాన వసతి గదులు ● బస్సుల బాధలు తీరేనా?

**ఆశ్రితవత్సలా.. అనాథరక్షకా.. లక్ష్మీనారసింహా.. కొండపై ఆశ్రయం కల్పించవయ్యా అంటూ భక్తులు వేడుకుంటున్నారు. ఆలయ విస్తరణకు ముందు కొండపైన, కొండ కింద భక్తులు బస చేసేందుకు వసతి గదుల సముదాయాలు ఉండేవి. అయితే ఆలయ విస్తరణలో కొండపైన వసతి గదులు, డార్మెటరీ హాల్స్‌ను తొలగించిన సంగతి తెలిసిందే. కొండకింద తులసీకాటేజ్‌లో మాత్రమే ప్రస్తుతం భక్తులు బస చేసేందుకు ఏర్పాట్లు ఉన్నా ఆర్టీసీ బస్సులు అక్కడికి వరకు చేరవేయడంలేదు. ఇక కొండపైన వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం సమస్య వేధిస్తుండగా.. భక్తుల రద్దీకి సరిపడా ఆర్టీసీ బస్సులు లేక భక్తులు నానా తంటాలు పడుతున్నారు.**

● యాదగిరిగుట్ట





బస్సు ఎక్కేందుకు కిక్కిరిసిన జనాలు(ఫైల్)

రూ.1,280కోట్ల ఖర్చుతో పూర్తిగా కృష్ణరాతితో ప్రధానాలయ పునర్నిర్మాణం చేసినా, కొండపైన నిలువ నీడ లేకుండా చేశారని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొండపైకి చేరుకున్న భక్తులు దర్శన క్యూకాంప్లెక్స్, దర్శన వరుసలు, ప్రసాదాల విక్రయశాల కౌంటర్, శివాలయానికి వెళ్లేదారిలో కాసింత షెడ్డు నిర్మాణం తప్ప ఎక్కడా నీడనే కనిపించదు. దీంతో ఎండలకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూనే భక్తులు ఇష్టదైవాల దర్శనాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితులకు ఆవేదన చెందడం తప్ప చేసేదేమీ లేదని వాపోతున్నారు. కృష్ణరాతి శిలలతో ఆలయంతోపాటు తిరుమాఢవీధుల్లో ఫ్లోరింగ్‌ను సైతం వేయడంతో భానుడి భగభగలతో ఇబ్బందులు పడుతున్నామని, వృద్ధులు, చంటిపిల్లల తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ తిరువీధుల్లో కూల్ వైట్ పెయింట్, ఉత్తర దిశలో కార్పెట్ ఏర్పాటు చేసినా అంతగా ఉపశమనం కలిగించడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇక వర్షం కురిసిందంటే తిరువీధుల్లోని భక్తులంతా అష్ట భుజి ప్రాకార మండపాల్లోకి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి. గతంలో ఇలా ఇబ్బందులకు గురి కాలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే దర్శనాలు, మొక్కుపూజలనంతరం స్వామి సన్నిధిలో ఘడియపాటు గడిపేందుకు అవకాశమే లేదు.

**పార్కింగ్‌కూ ప్రాబ్లమే.**

ఎంతో ఆనందోత్సాహాల నడుమ పిల్లాపాపలతో కలిసి తమ వాహనాల్లో వచ్చి రూ.500 రుసుము చెల్లించి కొండపైకి చేరుకుంటే పార్కింగ్ సమస్య తీవ్రంగా వేదిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు మాస్టర్ ప్లాన్‌లో 10వేల ద్విచక్రవాహనాలు, 5వేల కార్లు పార్క్ చేసే విధంగా, ఆధ్యాత్మికత పరిడవిల్లే విధంగా పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. యాదగిరికొండకు మామూలు రోజుల్లోకన్నా సెలవు, విశేష రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో ఇష్టదైవాల దర్శనాలకు వస్తుంటారు. ఇందులో ఎక్కువ శాతం భక్తులు తమతమ వాహనాల్లో వచ్చేందుకు ఆసక్తి చూపుతారు. కొండపైకి వచ్చే వాహనాల సంఖ్య సుమారు 1000 నుంచి 1500 వరకు ఉంటోంది. తీరా కొండపైకి వస్తే పార్కింగ్‌కు ప్రదేశాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో కొండపైకి వాహనాలను గంటల తరబడి అధికారులు అనుమతించకపోవడంతో కొండకింద చెక్‌పోస్టు వద్ద వేచి ఉండాల్సి వస్తోందని, ఆలయ ఘాట్‌రోడ్‌లలో వాహనాలు పార్కింగ్ చేయడంవల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని, కొండపైన వాహనాల పార్కింగ్‌కు తగు ఏర్పాట్లు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. మరికొందరు భక్తులు రూ.500 చెల్లించి మరి ఎక్కడ పడితే అక్కడే వాహనాలు ఎలా పార్కింగ్ చేస్తామని అధికారులతో వాగ్వాదాలకు దిగుతున్నారు.

**తులసీకాటేజ్‌లోనే దేవస్థాన వసతి గదులు**

యాదగిరిక్షేత్రానికి వచ్చిన భక్తులు ఎక్కువ శాతం దేవస్థానానికి చెందిన వసతి గదుల్లోనే (సత్రాలు) ఉండడానికి ఆసక్తి చూపుతారు. అప్పుడే తమ మొక్కు, యాత్ర పరిపూర్ణమైందిగా భావిస్తారు. అయితే ఆలయ విస్తరణలో భాగంగా కొండపైన వసతి గదులను పూర్తిగా తొలగించారు. కొండకింద బస్టాండ్ వద్ద ఉన్న మరో వసతి గదుల సముదాయాన్ని తొలగించగా.. మరొకటి టెండరు ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించగా.. కొండకింద మొదటి ఘాట్‌రోడ్ సమీపంలోని తులసీకాటేజ్ మాత్రమే దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతోంది. దీంతో క్షేత్రానికి వచ్చిన భక్తులకు తులసీకాటేజ్‌లో బస చేసేందుకు ఎక్కువశాతం ఆసక్తి చూపుతారు. తులసీకాటేజ్‌లో సుమారు 450కి పైగా గెస్ట్‌హౌస్‌లు, వసతి గదులు కలిపి ఉండగా వాటిలో 300వరకు వసతి గదుల్లో భక్తులు బసకు ఇస్తున్నారు. మిగిలిన 150కిపైగా గదులు త్వరలోనే అందుబాటులోకి తెస్తామని అధికారులు పేర్కొంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో సెలవు, విశేష రోజుల్లో దాదాపు యాభైనుంచి అరవై వేలకు పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. వచ్చిన భక్తులకు దేవస్థానం నిర్వహిస్తున్న తులసీకాటేజ్‌లోని వసతి గదులు సరిపోక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా భక్తులకోసం కాటేజీలను నిర్మాణం జరపాలని భక్తులు కోరుతున్నారు.

**పెద్దగుట్టపై విల్లాల నిర్మాణం జరిగేనా?**

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రధానాలయానికి అభిముఖంగా ఉన్న కొండ(పెద్దగుట్ట)పైన క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం విల్లాలను నిర్మించేందుకు నాటి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు కాసింత ఆలస్యంగానైనా డోనర్ పాలసీని నిర్ణయించి ఒక్కో విల్లాలో నాలుగు బెడ్‌రూమ్‌లు ఉండే విధంగా, ఒక్కో విల్లా నిర్మాణ వ్యయం రూ2కోట్లుగా నిర్ణయించింది. 250ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్దగుట్టను సుమారు రూ.207కోట్లతో ఆధునికీకరించి రహదారులు, ఎలక్ట్రిసిటీ, వాటర్, డ్రైన్‌లైన్‌తో ప్లాటింగ్ పూర్తి చేసిన అధికారులు ప్లాట్ల చుట్టూ ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లు, గ్రీనరీతో అందంగా తీర్చిదిద్దారు. ఈ క్రమంలో దాతలు సైతం విల్లాల నిర్మాణానికి ముందుకు వచ్చారని, త్వరలోనే విల్లాల నిర్మాణ ప్రక్రియ ఆరంభం కానుందని అధికారులు ప్రకటించారు. దీంతో అప్పట్లో తిరుమల తిరుపతి తరహాలో యాదగిరిక్షేత్రంలో విలాసవంతమైన విల్లా ఆధ్యాత్మిక ఆలయ నగరిలో రానున్నాయని స్థానికులు, భక్తులు ఎంతగానో భావించారు. కాగా నేటికీ పెద్దగుట్టపై ఒక్క విల్లాకు కూడా కనీసం శంకుస్థాపన పూజలు సైతం చేపట్టలేదు. దీంతో అధికారులు చేపట్టిన విల్లాల నిర్మాణ ప్రణాళికలు ప్రకటనలకే పరిమితమైయ్యాయి.

**బస్సుల బాధలు తీరేనా?**

యాదగిరిక్షేత్రానికి వస్తున్న భక్తులు బస్సులకోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఉద్ఘాటన జరిగిన కొంతకాలం రోజుకు 40 నుంచి 45 బస్సులను గుట్ట ఆర్టీసీ డిపో నుంచి కొండపైకి భక్తులను ఉచితంగా చేరవేయగా.. ఆ తర్వాత బస్సుల నిర్వహణ భారం దేవస్థానానికి తలనొప్పిగా మారడంతో పరిమిత సంఖ్యలో బస్సులు నడపాలని దేవస్థాన అధికారులు ఆర్టీసీ యాజమాన్యానికి సూచించింది. దీంతో అప్పటినుంచి దాదాపు సగానికి తగ్గి 15నుంచి 20 బస్సులు మాత్రమే రద్దీ వేళల్లో బస్సులు నడుపుతున్నట్టు తెలిసింది. వారాంతాలు, విశేష రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో ప్రతీసారీ ఆర్టీసీ బస్సులు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత పథకం ప్రవేశపెట్టడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడం బస్సులు మాత్రం రద్దీకి తగినట్లు నడపకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉంటున్నారు.



కొండకింద వాహనాల పార్కింగ్

## సైబర్ మోసాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ మీనా

**సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 8:** సైబర్ మోసాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నారాయణ జూనియర్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ సెల్, సూర్యాపేట పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సైబర్ జాగరుకత దివస్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వాటి నుంచి కాపాడుకోవడం కోసం అవగాహన ఒక్కటే మార్గమన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సైబర్‌క్రైం డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ కుశలవ, సైబర్‌క్రైం సిబ్బంది సైదులు, మహేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### పార్లమెంట్ ఎన్నికల్లో
## బీజేపీకి ఓటేసి గెలిపించాలి

● మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్యగౌడ్

**తుంగతుర్తి, ఫిబ్రవరి 8 :** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలో 'గ్రామం ఛలో-బస్తీ ఛలో' కార్యక్రమంలో భాగంగా వాల్ పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. దేశంలో అవినీతి మరకలేని పాలన నరేంద్ర మోదీకే సాధ్యమన్నారు. ఆర్థికాభివృద్ధిలో భారతదేశం 11వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరడం హర్షనీయమన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే దేశంలో సుమారు 5వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కేసీఆర్‌పై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. కార్యక్రమంలో మల్లెపాక సాయిబాబా, సంకినేని రవీందర్‌రావు, గాజుల మహేందర్, కొప్పుల లింగయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మట్టపల్లి నృసింహుడికి నిత్యారాధనలు

**మఠంపల్లి, ఫిబ్రవరి 8:** మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నిత్యారాధనలు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి, రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర, కుంకుమార్చనలు చేశారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఓటర్లు 29.20లక్షలు

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 8:** పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తుది ఓటర్ల జాబితాను గురువారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 29,20,119 మంది ఓటర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తుది జాబితా ప్రకారం 29,00,822 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా ప్రకటించిన తుది జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 19,297 మంది ఓటర్లు పెరిగారు.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 1,20,556 | 1,27,109 | 57 | 2,47,722 |
| నాగార్జునసాగర్ | 1,55,545 | 1,20,229 | 21 | 2,35,795 |
| మిర్యాలగూడ | 1,15,352 | 1,19,956 | 26 | 2,35,334 |
| నకిరేకల్ | 1,16,730 | 1,16,554 | 2 | 2,33,286 |
| దేవరకొండ | 1,31,599 | 1,30,241 | 18 | 2,61,858 |
| మునుగోడు | 1,27,547 | 1,28,513 | 3 | 2,56,063 |
| భువనగిరి | 1,08,598 | 1,11,358 | 1 | 2,19,957 |
| ఆలేరు | 1,16,344 | 1,17,497 | 19 | 2,33,860 |
| సూర్యాపేట | 1,18,510 | 1,24,422 | 13 | 2,42,945 |
| హుజూర్‌నగర్ | 1,21,390 | 1,28,692 | 17 | 2,50,099 |
| కోదాడ | 1,19,295 | 1,25,889 | 17 | 2,45,201 |
| తుంగతుర్తి | 1,28,240 | 1,29,752 | 7 | 2,57,999 |
| మొత్తం | 14,79,706 | 14,80,212 | 201 | 29,20,119 |

### దక్షిణ తెలంగాణపై
# బీఆర్ఎస్ నజర్





**నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):** స్వరాష్ట్రం ఏర్పాటైన దశాబ్దం తరువాత ప్రతిపక్ష పాత్రలోకి వచ్చిన బీఆర్ఎస్ దక్షిణ తెలంగాణపై ఫోకస్ పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన నాలుగు ఉమ్మడి జిల్లాలకు కీలక జలవనరైన కృష్ణానది జలాల్లో రాష్ట్ర హక్కుల సాధనను తెరమీదకు తెచ్చింది. ఈ ఎజెండాతో ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు తలపెట్టింది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ, నదీజలాల కేటాయింపుల అంశాన్ని కేంద్రం పరిధిలోని కేఆర్ఎంబీ ఆధీనంలోకి వెళ్లకుండా నిరోధించకపోతే భవిష్యత్‌లో సాగునీరు కాదుకదా, తాగునీటికీ ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుందనే బలమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సభను బీఆర్ఎస్ నిర్వహించనుంది. అధికార కాంగ్రెస్ సైతం కృష్ణాజలాల అంశంపై దీటుగా స్పందిస్తూ ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. రాజకీయలబ్ధి కోసమే బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందని అధికార పార్టీ వాదిస్తోంది. రెండు ప్రధాన పార్టీలు కృష్ణాజలాల అంశంపై పోటాపోటీగా స్పందిస్తుండడంతో, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే అంశం ఎజెండాగా మారే అవకాశం కనిపిస్తోంది.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ వార్**

కృష్ణానది జలాల్లో హక్కుల సాధన అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నడుమ పొలిటికల్‌వార్ కొనసాగుతోంది. కృష్ణాజలాల్లో వాటాలు రాబట్టడంలో, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించే అంశంలో తప్పు మీదంటే మీదని రెండు పార్టీల నేతలు వాదోపవాదాలు చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వంతో అంతర్గతంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కుమ్మక్కవడం వల్లే కృష్ణానది నుంచి రోజుకు 8టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏపీ చేపట్టిందని, దీంతో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నల్లగొండ జిల్లాకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని పూర్తిచేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్వాకమే అందుకు కారణమనేది కాంగ్రెస్ నేతల వాదన. అయితే బీఆర్ఎస్ నేతలు మాత్రం కాంగ్రెస్ వాదనను ఖండిస్తున్నారు. కృష్ణాజలాల అంశంపై కేంద్రంతో బీఆర్ఎస్ రాజీపడలేదని, నదీజలాల హక్కుల కోసమే పోరాడిందని ఆ పార్టీ నేతలు వివరిస్తున్నారు. కేఆర్ఎంబీకి నాగార్జునసాగర్ ప్రాజెక్టును అప్పగించే అంశంలో కేంద్రాన్ని విభేదించామని స్పష్టం చేస్తున్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా సాధించడమే ప్రధాన లక్ష్యంగా తమ పార్టీ నిరంతరం రైతులపక్షాన పోరాడుతోందని చెబుతున్నారు. రెండు పార్టీల నడుమ తీవ్రస్థాయిలో కృష్ణాజలాల అంశంపై పోరు సాగుతుండగా, లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

## నల్లగొండ నుంచి నదీజలాల ఉద్యమం



దక్షిణ తెలంగాణకు కేంద్రబిందువైన నల్లగొండ జిల్లాలోనే కృష్ణానది జలాల సాధన సభకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టడం వెనక కీలక వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సీనియర్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లాలో బీఆర్ఎస్ క్యాడర్ చెక్కుచెదరకుండా ఉండడంతో పాటు, గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన నష్టం లోక్‌సభ ఎన్నికల్లో కొనసాగకుండా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఊపునిచ్చేలా ఇక్కడ ఉద్యమాలు కొనసాగించేందుకు ఈ సభ దోహదపడుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతానికి జీవనరేఖగా మారిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ కేంద్రం చేతిలోకి వెళ్తే ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందనే బలమైన వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ తోడ్పడుతుందనే అభిప్రాయం బీఆర్ఎస్‌లో ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ నాగార్జునసాగర్ ఎడమకాల్వ నీటివిడుదల కోసం, ఆయకట్టు రైతుల కోసం కోదాడ నుంచి నాగార్జునసాగర్ వరకు కేసీఆర్ పాదయాత్ర నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు. సభ విజయవంతం చేసేందుకు, క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇన్‌చార్జిలు ఇప్పటికే సమీక్షలు, సమావేశాలు ప్రారంభించారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 15వేల మంది వరకు ఈ సభకు తరలించేలా కార్యాచరణ మొదలుపెట్టారు.

## పంట రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

**సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 8:** జిల్లాలో పంట రుణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎల్‌బీఎం సీహెచ్ బాపూజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు అధికారులు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. జిల్లాలో పామాయిల్ పంట సాగుచేసే రైతులకు పంట రుణాలు అందించాలని, జిల్లాలో 3600 ఎకరాల్లో ఆయిల్‌పాం పంట సాగవుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల్లో రూ.2614.67 లక్ష్యం కాగా తొమ్మిది నెలల్లో ఇప్పటి వరకు రూ.2567.55 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. 98శాతం వృద్ధి సాధించామని వివరించారు. అనంతరం 2024-25 సంవత్సరానికి నాబార్డు వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ, ఎల్‌డీవో వైభవ్‌వ్యాస్, ఎస్‌బీఐ ఏజీఎం జ్యోతి, నాబార్డు జీఎం సత్యనారాయణ, ఏపీజీవీబీ ఏజీఎం ఆశలత, పీడీ. కిరణ్‌కుమార్, ఏడీఏ రామారావునాయక్, పరిశ్రమల జీఎం తిరుపతయ్య, డీఈవో అశోక్, సంక్షేమ శాఖ అధికారులు జ్యోతిపద్మ, మాధవరెడ్డి, శంకర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**29లోపు సీఎంఆర్ బియ్యం అందించాలి**

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఈ నెల 29వ తేదీ గడువు లోపు 2022-23 సంబంధించిన సీఎంఆర్ అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్ అందించడంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ నెల 29వతేదీ వరకు ప్రభుత్వం గడువు విధించిందని తెలిపారు. ఈలోపు పెండింగ్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ రాంపతినాయక్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమనర్సయ్య, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఈవీఎంల గోదామ్‌లో కొనసాగుతున్న ఓటింగ్ యంత్రాల పరిశీలనను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డేలు తనిఖీ చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ ఉన్నారు.

## తప్పుల తడకగా దరఖాస్తులు



వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో సురేష్

**పెన్‌పహాడ్, ఫిబ్రవరి 8:** ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మీ పథకానికి గ్యాస్ వినియోగదారులు ఇచ్చిన దరఖాస్తులు తప్పులతడకగా ఉన్నాయని జడ్పీ సీఈవో సురేష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్యాస్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

## సాగునీటి కోసం ఎదురుచూపు

● ఎస్సారెస్పీ-2లో చివరి ఆయకట్టుకు నీటి కరువు

● 2000 క్యూసెక్కులకు 1500 క్యూసెక్కులే విడుదల

● 40 వేల ఎకరాలు నీరందక బీళ్లుగా సాగు భూములు


● 7లో..

# వైభవంగా లక్ష్మీనృసింహుల నిత్యకల్యాణం


లక్ష్మీనృసింహుల నిత్య కల్యాణంలో భాగంగా తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8:** యాదగిరిగుట్ట క్షేత్రంలో గురువారం లక్ష్మీనృసింహుల నిత్యకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. కొండగుహలో కొలువైన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ముందుగా సుదర్శన హోమం, అనంతరం ఉత్సవమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. దేవతల సేనానాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు అర్చకులు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. కొండపైన శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా రామలింగేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రంవేళ 108 దక్షిణావృత శంఖువులతో పంచామృతాభిషేకం జరిపి బిల్వపత్రాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,63,121 ఆదాయం వచ్చినట్లు, 15వేల మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

# మంచంపట్టిన మాధవరాయనిగూడెం

● ఇంటికొకరికి చొప్పున జ్వరపీడితులు ● కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు


జ్వరంతో బాధపడుతున్న రాణీ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 8 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని మాధవరాయనిగూడెం గ్రామం విషజ్వరాల బారినపడింది. ఇంటికొకరు చొప్పున జ్వర, ఒళ్లు నొప్పుల బాధితులు ఉన్నారు. తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వారిలో కొంతమంది హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. 20 రోజులుగా ఊరిలో విషజ్వరాలు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో పారిశుధ్యం లోపించడం తోనే దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతు న్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని ఆరోపిస్తు న్నారు. మిషన్‌భగీరథ పైపులు పగిలి నీరు కలుషితం అవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 2700 జనాభా ఉన్న గ్రామంలో ప్రతీ ఇంట్లో జ్వరపీడితులు ఉన్నారు. గ్రామంలో బస్తీ దవాఖానా ఉన్నా సరైన వైద్యసదుపాయాలు కల్పించడంలేదన్న విమర్శలు ఉన్నాయి. బస్తీ దవఖానాలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం.

**రక్త నమూనాలు సేకరిస్తున్నాం : వాణి, బస్తీదవఖానా వైద్యురాలు**

గ్రామంలో జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. జ్వరపీడితుల సర్వే చేస్తున్నాం. రక్తనమూనాలు సేకరించే పనిలో ఉన్నాం. ప్రజలు ఆందోళన చెందవద్దు. ఉన్నతాధికారులకు తెలియజేశాం. 10 రోజుల క్రితమే మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసి పరీక్షలు చేశాం. ఎలాంటి ఇబ్బందులు లేవు.

## అసెంబ్లీలో మన ప్రతినిధులు


శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు



సీఎం రేవంత్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న విప్ బీర్ల అయిలయ్య



అసెంబ్లీ హాల్‌లో కూర్చున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

# సాగునీటి కోసం ఎదురుచూపు



సూర్యాపేట జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు-2 కింద చివరి ఆయకట్టు ప్రాంతాలు రెండు దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూస్తున్నాయి. 20 ఏళ్ల కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంలుగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలు రూ.1100 కోట్లతో ఎస్సారెస్పీ-2ను చేపట్టారు. 1.44 లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో ఏర్పాటుచేసిన కాల్వలు పూర్తిగా ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో సుమారు 40 వేల ఎకరాలకు పైగా సాగునీరందడం లేదు. పదేళ్ల నుంచి కాల్వలకు 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా వారబంధీ పద్ధతిలో 1.500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో చివరి భూములకు నీరందకక బీళ్లుగా మారుతున్నాయి.

- ఎస్సారెస్పీ-2లో చివరి ఆయకట్టుకు నీటి కరువు ● తక్కువ స్థాయిలో నీటి విడుదల
- 2000 క్యూసెక్కులకు 1500 క్యూసెక్కులే విడుదల ● 40 వేల ఎకరాలు నీరందక బీళ్లు

● (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)/అర్వపల్లి

ఎస్సీరెస్పీ మొదటి దశ కాల్వలు కరీంనగర్ జిల్లా పరిధిలో ఉండగా, రెండవ దశ సూర్యాపేట జిల్లాలో ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మైలవరం సమీపంలోని లోయర్‌మానేరు నుంచి జనగాం జిల్లా కొడకండ్ల మండలంలోని బయ్యన్నవాగుకు నీరు ప్రవహిస్తుంది. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ-2 పరిధిలోని తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలోని కాల్వలోకి మొదటి నీరు ప్రవహిస్తుంది. అక్కడి నుంచి గ్రామసమీపంలోనే డీబీఎం-69, డీబీఎం-70 కాల్వలకు నీరు వెళ్తుంది. డీబీఎం-69 పరిధిలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు నీరందుతుండగా, డీబీఎం-70 ద్వారా నాగారం మండలానికి చేరుతుంది. అక్కడి నుంచి ఎస్సారెస్పీ-2 దశలోని ప్రధాన కాల్వ అయిన డీబీఎం-71కు నీటి మార్గం కొనసాగుతుంది.

### చివరి భూములకు నీరేది?

గత తొమ్మిది సంవత్సరాలుగా ఆయకట్టు చివరలో ఉన్న పెన్‌పహాడ్, మోతె, చివ్వెంల మండలాలకు నీరందిన దాఖలాలు లేవు. వానాకాలం, యాసంగి పంటలకు నీరందిస్తున్నా సరిపోను విడుదల చేయడం లేదు. నడిగూడెం, చివ్వెంల, మద్దిరాల, నూతన్‌కల్, మోతె, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లోని చివరి భూములకు ఇంతవరకు నీరు అందిన దాఖలాలు లేవు. ఎస్సారెస్పీ అధికారులకు నీళ్ల అందడం లేదని రైతులు ఎన్నోసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, ఫలితం కనిపించడం లేదు. తాజాగా ఈ నెల 5వ తేదీన నీటిని విడుదల చేసినప్పటికీ, 1500 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేయడంతో గురువారం నాటికి సూర్యాపేట మండలం వరకు నీరు చేరుకున్నాయి.

### మూడు నియోజకవర్గాల పరిధిలో 70 కిలోమీటర్లు

ఎస్సారెస్పీ-2 దశలో ప్రధాన కాల్వ డీబీఎం-71 పరిధి 70 కిలోమీటర్లు. జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలోని నాగారం, అర్వపల్లి మండలాలు, సూర్యాపేట నియోజకవర్గంలో ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలు, కోదాడ నియోజకవర్గ పరిధిలో మోతె మండలాల పరిధిలోని 192 గ్రామాల్లో ఈ కాల్వ కొనసాగుతుంది. వెలిశాల నుంచి మొదలైన జిల్లాలోని నడిగూడెం మండలం వరకు ఎస్సారెస్పీ-2 ఉంది. మొత్తం కాల్వ పరిధిలో చెరువులు, కుంటలు కలిపి 350లకుపైగా ఉన్నాయి.

### సామర్థ్యం కన్నా తక్కువగా నీటి విడుదల

కాల్వ తవ్విన సమయంలో 2,000 క్యూసెక్కులకు సరిపోయేలా ఏర్పాటుచేశారు. అయితే ఏనాడూ 1500 క్యూసెక్కులకు మించి నీటిని విడుదలచేసిన దాఖలాలు లేవు. గోదావరి నదీ పరివాహకంలో నీటి లభ్యత ఎక్కువ మోతాదులో ఉన్న సమయంలోనూ నీటి విడుదల 1500 క్యూసెక్కులు మించలేదు. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.



సీతారంపురం వద్ద లైనింగ్ లేని 71డీబీయం మెయిన్‌కాల్వ

దీనికి తోడు రెండు దశాబ్దాల కింద తవ్విన కాల్వలు కావడంతో కాంక్రీట్ లైనింగ్ లేక 30 శాతం నీరంతా వృథాగా పోతోంది. మెయిన్, ఉపకాల్వల్లో పిచ్చిచెట్లు మొలిచి, పూడికలతో పూడకపోయి అధ్వానంగా తయారయ్యాయి.

### మంత్రులు పరిశీలనతో సరి!

ఎస్సారెస్పీ-2 పథకం కింద తుంగతుర్తి మండలంలోని రుద్రమచెరువు, వెంపటి చెరువు, గొట్టిపర్తి చెరువు, బండరామారం చెరువులను నీటి సామర్థ్యాన్ని పెంచి ప్రాజెక్టులుగా మార్చాలని గత ప్రభుత్వం ఆలోచించింది. ఈ మేరకు రుద్రమచెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీ‌ష్‌రావు ఒకసారి పరిశీలించారు. అదేవిధంగా కేతిరెడ్డి ఆనకట్టు కూడా ఒక టీఎంసీగా మార్చాలని ప్రతిపాదించినా ఆలోచన కార్య రూపం దాల్చలేదు.

### తూతూ మంత్రంగా తూములు, లైనింగ్ మరమ్మతులు

శ్రీరాంసాగర్ మెయిన్‌కాల్వలు 150కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఏడేళ్ల కిందట రూ.12కోట్లతో నాగారం మండలం ఈటూరు నుంచి అర్వపల్లి మండలం గోపాల్‌రెడ్డినగర్ వరకు కాల్వల లైనింగ్ పనులు చేపట్టి వదిలేశారు. ఆరేళ్ల క్రితం రూ.2కోట్లతో 45 తూములకు మరమ్మతులు చేసినా శ్రీరాంసాగర్ నీరు విడుదల చేసినప్పుడల్లా ప్రతి ఏటా తుప్పుపట్టడంతో రైతులు తూములను ఎత్తేసమయంలో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

### కాల్వలకు లైనింగ్ పనులు చేపట్టాలి



శ్రీరాంసాగర్ రెండోదశ మెయిన్ కాల్వలకు, ఉప కాల్వలకు కాంక్రిట్ లైనింగ్ పనులు చేపట్టి నిరంతరం గోదావరి జలాలను అందించాలి. పూడిపోయిన కాల్వల్లో మరమత్తులు చేపట్టి పిచ్చి మొక్కలను తొలగించాలి. వారబందీ కాకుండా నిరంతరం నీటిని విడుదల చేయాలి.

● బైరబోయిన భూమయ్య, అర్వపల్లి రైతు

### నాలుగేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపాం

శ్రీరాంసాగర్ మెయిన్ కాల్వలు, ఉపకాల్వల్లో పూడిక తీత కోసం నాలుగేళ్ల క్రితమే నిధులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాలేదు. జిల్లాలో 300 చెరువులకు కాళేశ్వరం జలాలు అందిస్తున్నాం. శ్రీరాంసాగర్ కాల్వల పనుల కోసం రూ.350 కోట్లు ప్రతిపాదనలు పంపించాం. చివరి భూములకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

● సత్యనారాయణ, డీఈ

అర్వపల్లి మండలం సీతారాపురం ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న ఉపకాల్వలో దట్టంగా పెరిగిన చెట్లు

### ఆరేళ్లు గడిచినా...

శ్రీరాంసాగర్ 69, 70, 71 డీబీఎం మెయిన్ కాల్వలతో పాటు ఉపకాల్వలు పటిష్ఠతను కోల్పోయి అక్కడక్కడా అధ్వానంగా మారాయి. మెయిన్, ఉపకాల్వల కోసం పునర్జీవన పథకం కింద రూ.300 కోట్ల ప్రతిపాదనలు రూపొందించి ఆరేళ్లు గడిచినా కాల్వల పునరుద్ధరణ పనులు నేటి వరకు మొదలుపెట్టలేదు. అర్వపల్లి రామన్నగూడెం ఉపకాల్వ గత ఏడాదిగా కంపచెట్లు పెరిగి, మట్టి పూడకపోయి 50శాతం మేర నీరు వృథా అయినా ఎవరూ పట్టించుకోలేదు. నేటికి ఆ కాల్వ పరిస్థితి అధ్వానంగా మారింది. అర్వపల్లి మండలంలో ఉపకాల్వలైన 8-ఎల్, 9-ఎల్, 10-ఎల్, 11-ఆర్, 12- ఎల్, 13-ఆర్, 14-ఎల్, 15-ఎల్, 16-ఆర్, మైనర్ ఉపకాల్వలు ఉన్నాయి. అర్వపల్లి మండలంలో కాసర్లపాడు గ్రామంలో 12 గొలుసుకట్టు చెరువులు ఉన్నా నేటి వరకు ఆ చెరువులకు నీరు అందడంలేదు. అయితే వీటికి ఉపకాల్వలు లేక చుట్టుపక్కల పొలాలకకు సాగునీరందడం లేదు.

## మూడు నెలల్లోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

ఎంపికైన తిరుమలగిరి(సాగర్) యువకుడు



రమావత్ రాజు

**తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 8:** మారుమూల తండాకు చెందిన ఓ గిరిజన యువకుడు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పలు పోటీపరీక్షలు రాసి మూడు నెలల్లో మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ ముని, బుజ్జిల కుమారుడైన రమావత్ రాజు ఈ ఘనతను సాధించి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచాడు. రాజు తన ప్రాథమిక విద్యాభ్యాసం ఒకటి నుంచి 6వ తరగతి వరకు స్థానికంగా ఎర్రచెరువుతండా, నెల్లికల్లు గ్రామంలో పూర్తి చేశాడు. 7 నుంచి 10వ తరగతి వరకు మిర్యాలగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్‌ను మిర్యాలగూడలోని వాసవీ జూనియర్ కళాశాలలో పూర్తిచేశాడు. 2020లో నల్లగొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో బీఎస్సీని పూర్తి చేసిన అనంతరం ఆయన పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం అప్పటి నుంచే సన్నద్ధమయ్యాడు. మూడేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న క్రమంలో గత మూడు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్‌ఆర్‌బీ, ఐడీబీఐ, ఈఎస్ఐసీ క్లరికల్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం తాను ఏదైనా ఒక ఉద్యోగంలో చేరుతానని తెలిపాడు. అనంతరం ఉన్నత ఉద్యోగాన్ని సాధించేందుకు తన ప్రిపరేషన్‌ను కొనసాగిస్తానన్నారు. మారుమూలతండాలో నిరుపేద వ్యవసాయ కూలీ పనులు చేసుకునే కుటుంబానికి చెందిన రాజు పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంపై పలువురు అభినందించారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 8 :** రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం రుద్రమదేవికాలనీ శివారులో జనవరి 31వ తేదీన రోడ్డు వెంట వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. బాధితుడు ఎవరనేది తెలియకపోవడంతో పోలీసులు స్థానిక రుద్రమదేవికాలనీ వాసులను విచారించారు. గత కొంత కాలంగా ఇదేప్రాంతంలో బిక్షాటన చేస్తూ బస్‌స్టాప్, కిరాణా దుకాణాల వద్ద పడుకునేవాడని, అతనిది కొల్లాపూర్, గద్వాల అని చెప్పేవాడని తెలిపారు. ఇతర వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు రూరల్ ఎస్ఐ 8712670177 సీఐ 8712670142, సిబ్బంది 8112531330 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## అతివేగం.. మూడు లారీలు ధ్వంసం



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

**పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 8 :** నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు లారీలు ధ్వంసమయ్యాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంగడిపేట ఎక్స్‌రోడ్డు గ్రామ శివారులోని భారత్ పెట్రోల్‌బంక్ వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి (167)పై గురువారం ఉదయం అతివేగంగా వచ్చిన లారీ రోడ్డు క్రాస్ చేస్తున్న లారీ చివరలో ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో మూడులారీలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో పెద్దగా వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. లారీల్లో డ్రైవర్లు స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. అతివేగంతో ఢీకొట్టిన లారీ డ్రైవర్‌ను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలానికి గుడిపల్లి పోలీసులు చేరుకొని వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా లారీలను పక్కకు తరలించారు. లారీల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదులేదని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

## కుక్కల దాడిలో జింక మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 8 :** జనావాసాల మధ్యకు వచ్చిన జింక కుక్కల దాడిలో మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డివిజన్ అటవీ శాఖ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే నాగార్జునసాగర్ డివిజన్ అటవీ శాఖ పరిధిలోని నెల్లికల్ బీట్ సమ్మక్క-సారక్క దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన అర్బన్ పార్క్ నుంచి జింక గురువారం తెల్లవారుజామున తిరుమలయ్య గట్టు సమీపంలోని రోడ్డుపైకి వచ్చింది. రహదారిపై జింకను చూసిన కుక్కలు దానిపై దాడి చేశాయి. ఈ దాడిలో జింక గాయాలపాలై మృతి చెందింది. గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులు సమాచారం అందించడంతో పంచనామా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జింకను పూడ్చివేసినట్లు ఎఫ్‌డీవో సర్వేశ్వర్ తెలిపారు. వన్యప్రాణులు దారి తప్పి జనావాసాల్లోకి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎఫ్‌డీవో తెలిపారు.

## వివాహేతర సంబంధం అనుమానంతో హత్య

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 8:** నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో ఈ నెల 2వ తేదీన జరిగిన ఓ వ్యక్తి హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. భార్యతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడనే అనుమానంతో ఇద్దరి సహాయంతో ఈ హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. కేతేపల్లి మండలం ఇప్పలగూడెం గ్రామానికి చెందిన వంటల జానయ్య-లక్ష్మమ్మ దంపతులకు సంతానం లేకపోవడంతో సైదులును దత్తత తీసుకుని సాదుకున్నారు. సైదులు(38) అదే గ్రామానికి చెందిన మేకల అర్చనను 18 సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సైదులు, అర్చన మధ్య బేదాభిప్రాయాలు రావడంతో ఏడేళ్లుగా విడివిడిగా జీవనం సాగిస్తున్నారు. భార్య అర్చన హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, కుమారుడితో కలిసి సైదులు సెంట్రింగ్ పనులతో పాటు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ గ్రామంలోనే ఉంటున్నాడు. గ్రామానికి చెందిన మోదాల శ్రవణ్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ భూమిలో సైదులు కూలి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో శ్రవణ్ భార్యతో సైదులు చనువుగా ఉండేవాడు. అయితే తన భార్యతో సైదులుకు వివాహేతర సంబంధం ఉందని శ్రవణ్‌కుమార్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయాన్ని బావమరిది సూర్యాపేట జిల్లా కుడకుడ గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్వర్లుకు తెలిపి సైదులును అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఇప్పలగూడెంలో ఉంటున్న వెంకటేశ్వర్లుకు వరుసకు సోదరుడైన బండారి సాయిని సహాయం కోరగా అతడు అంగీకరించాడు. వీరు ముగ్గురు కలిసి ఈ నెల 2వ తేదీన సైదులు కదలికలపై నిఘా పెట్టారు. గ్రామంలోని ఓ బెల్ట్‌షాపు వద్ద మద్యం తాగుతున్న సైదులు వద్దకు వెంకటేశ్వర్లు, సాయి వెళ్లి బయటకు వెళ్లి మద్యం తాగుదామంటూ నమ్మబలికి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌కు తీసుకెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం శ్రవణ్ కూడా అక్కడికి చేరుకుని నలుగురు కలిసి మద్యం తాగారు. ఈ సమయంలో శ్రవణ్ తన భార్య విషయంలో సైదులుతో గొడవపడ్డాడు. మాటమాట పెరిగి వెంట తెచ్చుకున్న సుత్తితో సైదులుపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఆ సమయంలో అటుగా ఎవరన్న వస్తున్నారేమో చూసేందుకు రోడ్డుపై సాయి కాపలాగా ఉన్నాడు. హత్య అనంతరం నిందితులు ముగ్గురు అక్కడినుంచి పరారయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం నిందితులను గ్రామశివారులో అదుపులోకి తీసుకొని వారి నుంచి హత్యకు ఉపయోగించిన సుత్తి, మూడు సెల్‌ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ ఎస్ రాఘవరావు, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, సిబ్బంది పాల్గొన్నారు.





వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఇన్‌సెట్‌లో వంటల సైదులు(ఫైల్‌ఫొటో)

## మరణంలోనూ నీవెంటే...



మల్లెబోయిన లింగయ్య, పెంటమ్మ(ఫైల్‌ఫొటో)

**మాడ్గులపల్లి, ఫిబ్రవరి 8:** మూడుముళ్ల బంధంతో 50 ఏళ్లకు పైగా కలిసిమెలసి జీవించిన ఆ దంపతులు కుమారుల ఆదరణ లేక తనువు చాలించాలనుకున్నారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఆత్మహత్యాయత్నం చేయగా, భర్త అదే రోజు, చికిత్స పొందుతూ భార్య గురువారం మృతి చెందింది. నాలుగు రోజుల వ్యవధిలో దంపతుల మృతితో నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆగామోత్కూరు గ్రామానికి చెందిన మల్లెబోయిన లింగయ్య(86), పెంటమ్మ(80) దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. లింగయ్య తన మూడు ఎకరాల భూమిని ముగ్గురు కుమారులకు పంచాడు. పెద్దకుమారుడు సైదులు మండలంలోని యాద్గిరిపల్లిలో ఉంటున్నాడు. అదే గ్రామంలో ఉండే రెండో కుమారుడు రాములు చనిపోగా, చిన్నకుమారుడు శ్రీను ఆగామోత్కూరులో వేరుగా ఉంటున్నాడు. లింగయ్య దంపతులు గ్రామంలోని స్వగృహంలో ఉంటున్నారు. భూమి పంపిణీకి ముందు రైతుబంధుతో పాటు పింఛన్ డబ్బులతో జీవితం గడిపేవారు. కొద్దికాలంగా కుమారులు ఆదరించకపోవడం, రైతుబంధు నగదు కూడా వారికే దక్కుతుండటం, అనారోగ్యం, చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో జీవితంపై విరక్తి చెందారు. ఈ నెల 5వ తేదీ రాత్రి పురుగుల మందు తాగి సొమ్మసిల్లి పడిపోయారు. ఇంట్లోకి వెళ్లిన స్థానికులు గమనించి 108 నెంబరుకు సమాచారమిచ్చారు. ఆ వాహనం వచ్చేసరికే భర్త లింగయ్య మృతి చెందాడు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న పెంటమ్మ(80)ను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మరణంలోనూ నీవెంటే అంటూ మృత్యుఒడిలోకి వెళ్లింది. ఇరువురి మృతి స్థానికులకు కంటతడి పెట్టించింది. ఇలాంటి కష్టం ఏ వృద్ధ దంపతులకు రావొద్దని స్థానికులు వాపోయారు. పెంటమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. గురువారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా తమ తల్లిదండ్రులు లింగయ్య, పెంటమ్మలు కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని కుమార్తె మంగ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## మద్యం మత్తులో ఇంటర్ ప్రాక్టికల్స్ ఎగ్జామినర్



మద్యం మత్తులో హాజరైన ఎగ్జామినర్ చంద్రశేఖర్

**దేవరకొండ, ఫిబ్రవరి 8 :** ఇంటర్ ప్రాక్టికల్స్ విధులకు ఓ ఎగ్జామినర్ మద్యం మత్తులో హాజరయ్యాడు. విద్యార్థులు గుర్తించి ప్రిన్సిపాల్‌కు సమాచారమివ్వడంతో విధుల నుంచి తొలగించారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ బాలుర జూనియర్ కళాశాలలో ఈ సంఘటన జరిగింది. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ద్వితీయ ఇంటర్ ఫిజిక్స్ ప్రాక్టికల్ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు దఫాల్లో నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించనున్న ఈ పరీక్షలకు మిర్యాలగూడ పట్టణానికి ప్రైవేట్ కళాశాల లెక్చరర్ చంద్రశేఖర్‌కు ఇంటర్ బోర్డు విధులను కేటాయించింది. ఉదయం బ్యాచ్ పరీక్ష ముగియగానే భోజనానికి వెళ్లిన చంద్రశేఖర్ మద్యం మత్తులో మధ్యాహ్నం 2గంటలకు పరీక్షకు హాజరయ్యాడు. చంద్రశేఖర్ గదిలోకి రావడంతోనే గుర్తించిన విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్యకు ఫిర్యాదుతో చేయడంతో పాటు విద్యార్థి సంఘాల నాయకులకు సమాచారమిచ్చారు. వెంటనే ప్రిన్సిపాల్ మల్లయ్య పరీక్ష నిర్వహించే గదికి చేరుకుని ఎగ్జామినర్ చంద్రశేఖర్ మద్యం తాగి ఉన్నాడని గుర్తించి, విధుల నుంచి తొలగించారు. వెంటనే మరొక ఎగ్జామినర్‌ను నియమించి పరీక్షను కొనసాగించారు. ఎగ్జామినర్ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ, సోషల్‌మీడియా జాతీయ కోఆర్డినేటర్ పాలగట్టి శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

## పౌతీ రిజిస్ట్రేషన్‌కు రూ.30వేలు లంచం

- ఆర్ఐను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి

**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 8:** వ్యవసాయ భూమిని పౌతీ రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.30వేలు లంచంగా తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఎంవీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం కేశ్యతండాకు చెందిన బాణావత్ లచ్చుకు వరుసకు పెద్దమ్మ, పెద్దనాన్న అయిన బాణావత్ హన్మా, బాణావత్ మంగ్లీలు కోల్‌ముంతలపహాడ్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తెలు దేవి, అచ్చాలుకు వివాహం అయిన అనంతరం హన్మా, మంగ్లీ దంపతుల బాధ్యతలను లచ్చు చూసుకునేవాడు. హన్మా, మంగ్లీలకు కోల్‌ముంతలపహాడ్ గ్రామంలోని ఎకరం భూమి ఉంది. దంపతులిద్దరూ రెండేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందారు. రూ.50లక్షలు విలువచేసే ఎకరం పొలాన్ని లచ్చు పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వారి కుమార్తెలు దేవి, అచ్చాలు అంగీకరించారు. దీంతో లచ్చు రెండు నెలల క్రితం కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. ఎకరం భూమి తన పేరిట పట్టా చేసేందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి రేపు మాపు అంటూ తిప్పుతున్నాడని బాధితుడు వాపోయాడు. ఈ క్రమంలో ఆర్ఐ రూ.60వేలు డిమాండ్ చేయగా, రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. 15 రోజుల క్రితం లచ్చు ఏసీబీ అధికారులను సంప్రదించి పరిస్థితిని వివరించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు లచ్చు గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌చేసి డిండి ఎక్స్‌రోడ్డు వద్దకు రావాలని కోరాడు. దీంతో తన కారులో డిండి చౌరస్తాకు వచ్చిన శ్రీనివాసరెడ్డి లచ్చు నుంచి రూ.30వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఎంవి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కింద ఆర్ఐపై కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే సెల్ 9154388918, 9154388920, 9154388921తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సోదాల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు, బి.రామారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ అనంతరం ఆర్ఐ శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్ నాంపల్లి కోర్టులో హాజరుపెట్టనున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

## హాస్టళ్లలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలి



భువనగిరి బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

**భువనగిరి టౌన్, ఫిబ్రవరి 8:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.మారుతీ దేవి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బాలల పరిరక్షణ చైతన్య కార్యక్రమంలో భాగంగా గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ఎస్సీ బాలికల, బీసీ బాలికల వసతిగృహాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఉన్నత భవిష్యత్‌కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ సంక్షేమ వసతి గృహాలనుంచి పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులకోసం నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. హాస్టల్ భవనాల పరిశుభ్రతను, భద్రతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అలాగే పలువురు ప్రముఖులు వసతి గృహాల్లో ఉండి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగారని, వారి స్ఫూర్తితో చదువులో రాణించాలన్నారు. సమస్యలన్నీ తాత్కాలికమేనని, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని జీవితంలో నిలదొక్కుకోవాలని విద్యార్థులకు సూచించారు. వసతిగృహాల్లో కిచెన్, డార్మెటరీ భవన ప్రాంగణాలను పరిశీలించారు. నిర్వహణ తీరుపై బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ కృష్ణవేణికి పలు సూచనలు చేశారు.

### విద్యార్థినుల మృతిపై విచారణ ప్రారంభం

ఆత్మహత్యల ఘటనపై ప్రభుత్వం నియమించిన జిల్లా విచారణ అధికారి నాగలక్ష్మీ గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పలు వివరాలు సేకరించారు. వారిద్దరితో కలిసి చదువుకున్న సహచర విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు ప్రగతి, తరగతి గదిలో వారి ప్రవర్తన తదితర అంశాలపై ఆరాతీసినట్లు తెలిసింది. ఆత్మహత్యకు ముందు పాఠశాలలో పీఈటీ ప్రతిభ, వార్డెన్ శైలజ నిర్వహించిన కౌన్సిలింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించాల్సిన ఆవశ్యకత, కౌన్సిలింగ్ చేసిన తీరు, భవ్యశ్రీ, వైష్ణవి ఇచ్చిన సమాధానాలు, వార్డెన్, పీఈటీ అడిగిన ప్రశ్నలు తదితర వివరాలపై ఆరాతీసినట్లు సమాచారం. పీఈటీతో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు నమోదుచేశారు. త్వరలోనే వార్డెన్ శైలజను కూడా విచారణ అధికారి దర్యాప్తు చేయనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కేఆర్ఎస్ లక్ష్మీదేవి కూడా దర్యాప్తు నిమిత్తం భువనగిరికి రానున్నారు. ఆమె కూడా పాఠశాలను, హాస్టల్‌ను సందర్శించి పలువురితో మాట్లాడి దర్యాప్తు చేయనున్నారు.

## సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల నిలిపివేత



ఎడమకాల్వకు నీటి విడుదల నిలిపివేసిన దృశ్యం

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 8:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వకు గురువారం మధ్యాహ్నం నీటి విడుదలను నిలిపివేశారు. ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనవరి 31వ తేదీన ఎడమకాల్వకు నీటి విడుదలను ప్రారంభించారు. తొమ్మిది రోజుల్లో మొత్తం 3 టీఎంసీల నీటిని (34,809 క్యూసెక్కులు) విడుదల చేశామని ప్రాజెక్టు జేఈ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఉదయం 11గంటల నుంచి గంటకు 1000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదలను తగ్గిస్తూ ఒంటి గంటకు పూర్తిగా నీటి విడుదలను నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 518.10 అడుగులు (145.8335టీఎంసీలు)గా నమోదైంది. సాగర్‌లో విద్యుదుత్పత్తి చేస్తూ 22,881 క్యూసెక్కులు, జంట నగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీకి 1350 క్యూసెక్కులు మొత్తంగా 24,231 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు. సాగర్ కుడి, ఎడమ, వరద కాల్వలకు నీటి విడుదల లేదు.

## విద్యార్థులకు అల్పాహారం అభినందనీయం



నేరేడుచర్ల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఎంఈవో

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 8:** పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈవో ఛత్రునాయక్ అన్నారు. నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల్లోని 18 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్‌క్లబ్, దాతల సహకారంతో ఉదయం, సాయంత్రం అల్పాహారం కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. నేరేడుచర్ల మాజీ సర్పంచ్, జాన్‌పహాడ్ మేజర్ డీసీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి అల్పాహారానికి అయ్యే ఖర్చు భరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, సత్యనారాయణరెడ్డి, రామస్వామి, సూరిబాబు, సైదిరెడ్డి, రాచకొండ శ్రీనివాసరావు, ఉపేందర్, సురేష్, పద్మావతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## 'మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలి'

**మఠంపల్లి, ఫిబ్రవరి 8:** మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో ఖాళీగా ఉన్న గ్రామపంచాయతీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. ఎంపీవో అంజనేయులుకు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ స్థలాన్ని బందిల దొడ్డికి ఉపయోగించేందుకు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారని తెలిపారు. గోడ కూలి ఖాళీగా స్థలంలో కాలనీవాసులు, గ్రామస్థులకు ఉపయోగపడే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## సత్యనారాయణ ఆశయాలు సాధించాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 8:** సీపీఐ సీనియర్ నాయకుడు తమ్మినేని సత్యనారాయణ ఆశయాలు సాధించాలని ఏఐటీయూసీ ప్రాంతీయ నాయకులు పోతురాజు సత్యనారాయణ, జీవీ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని తమ్మర గ్రామంలోని స్థూపం వద్ద కుటుంబసభ్యులు తమ్మినేని సరోజనమ్మ రమేష్ ఆధ్వర్యంలో తమ్మినేని సత్యనారాయణ 18వ వర్ధంతిని నిర్వహించారు. తమ్మినేని సత్యనారాయణ గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాతంగి ప్రసాద్, కొండ కోటేశ్వరరావు, నిడిగొండ రామకృష్ణ, మాతంగి గాంధీ, బత్తినేని శ్రీనివాసరావు, నిడిగొండ శ్రీను, ఎర్ర లక్ష్మీనారాయణ, మందిరపు బిక్షబయ్య, ఎర్ర సత్యం, గోవిందరావు, సర్వయ్య, మహ్మద్ ఉన్నారు.

## 16న రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 8:** రాష్ట్రస్థాయి 33వ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నామా నర్సింహారావు తెలిపారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 19 వరకు చింతలపాలెం మండల కేంద్రంలో 33వ సబ్‌జూనియర్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు సంబంధించి బాలబాలికల జట్లను ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 16సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, 55 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లు వెంట తెచ్చుకోవాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## జాకీర్ హుస్సేన్ జీవితం అందరికీ ఆదర్శం

**సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 8:** భారత మూడో రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ జీవితం అందరికీ ఆదర్శమని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. ఖాలేద్ అహ్మద్ అన్నారు. జాకీర్ హుస్సేన్ 127వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని ఇమాంపేట కస్తూర్బా మైనార్టీ పాఠశాల విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. జాకీర్ హుస్సేన్ గొప్ప నాయకుడు, విద్యావేత్త, ఉప రాష్ట్రపతి, యూపీ గవర్నర్, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హుస్సేన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి అనిత, జహంగీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో దివ్యాంగులకు అధిక నిధులు కేటాయించాలి

**మునగాల రూరల్, ఫిబ్రవరి 8:** దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కోరారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య, జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపియాదవ్, తిమ్మారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ సోమిరెడ్డి సైదిరెడ్డి, నాయకులు బలుపునూరి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మారెడ్డి ఏసురెడ్డి, ఎర్ర నాగలక్ష్మి, కేతిరెడ్డి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరిగడ్డి వాము దగ్ధం

**కోదాడటౌన్, ఫిబ్రవరి 8:** కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్ 18వ వార్డులో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. రైతు మండగడప లక్ష్మీనరసమ్మ పాల వ్యాపారం పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంది. గేదెల కోసం రూ.50 వేలు ఖర్చు చేసి గడ్డి కొనుగోలు చేసిన గడ్డివాము ఏర్పాటు చేసింది. విషయం తెలుసుకున్న స్థానిక వార్డు కౌన్సిలర్ కర్రి శివసుబ్బారావు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చినా గడ్డివాము పూర్తిగా కాలిపోయింది.

## 21క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 8:** హుజూర్‌నగర్ పట్టణంలోని మల్లన్ననగర్ కాలనీకి చెందిన తాండ్రకొండ కోటేశ్వరరావు నిల్వ చేసిన 21క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోటేశ్వరరావు నివాసంలో బియ్యం ఉన్నాయనే సమాచారంతో గురువారం రాత్రి సోదాలు చేసి పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా కేసు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.



# కార్మికుల సంక్షేమానికి చట్టాలు చేయాలి



నూతన్‌కల్‌లో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నాగయ్య



తుంగతుర్తి: సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



బేతవోలులో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

**నూతన్‌కల్, ఫిబ్రవరి 8:** దేశంలో ఉన్న 20 కోట్ల వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ కార్మికుల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను హామీలు చేయాలని కోరారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టిపల్లి సైదులు, కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్యం, కందాళ శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, కడెం లింగయ్య, జానయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**తుంగతుర్తి:** కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 16న కార్మికుల సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజారాం కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల్లో ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా దేశాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. దేశవ్యాప్త కార్మిక సమ్మె బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కడెం లింగయ్య, కునుకుంట్ల సైదులు, కిరణ్‌కుమార్, మధు, శ్యామ్, సుందర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్:** అన్ని ట్రేడ్ యూనియన్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్‌యాదవ్ కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్లకు చెందిన కార్మికులతో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సోమయ్య, బెల్లంకొండ గురవయ్య, ముక్కంటి, చింతకాయల రాము, ఇందిరాల వెంకటేశ్వర్లు, మల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ రూరల్:** కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం. ముత్యాలు డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె నోటీసును గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌నాయక్‌కు అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మికవర్గం తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్పీల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, రాజ్యలక్ష్మి, అరుణాంజలి, దుర్గ, రాజేశ్వరి పాల్గొన్నారు.

**చిలుకూరు:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపడుతున్న గ్రామీణ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని బేతవోలులో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షణగా ఉండడం లేదన్నారు. గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోరండ్ల ముత్తయ్య, వెంకటయ్య, కోరండ్ల ఉపేందర్, పెద్ద మట్టయ్య, తాళ్చూరి రామారావు, జనార్ధన్ పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మద్దిరాల, ఫిబ్రవరి 8:** గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పశువైద్యాధికారి ఆసీఫా అన్నారు. మండలంలోని చందుపట్లలో వీధులను పరిశీలించారు. వీధుల వెంట చెత్త చెదారం వేయొద్దని సూచించారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కస్తూరి రాణిశ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రేసు తరుణ్, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము అంజయ్య, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**అర్వపల్లి:** గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సుయాదవ్ అన్నారు. మండలంలోని జాజిరెడ్డిగూడెంలో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సందీప్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

**సూర్యాపేటరూరల్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడీ భిక్షం సూచించారు. స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సోలిపేట, రామచంద్రపురం, రాజనాయక్‌తండాల్లో గ్రామస్థులకు



చందుపట్లలో వీధులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి ఆసీఫా

అవగాహన కల్పించారు. కార్యదర్శులు, గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో మురుగు కాల్వలు, వీధులు, శుభ్రం చేసి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

**హుజూర్‌నగర్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేపలసింగారం ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. డ్రై డే సందర్భంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలి

**కోదాడటౌన్, ఫిబ్రవరి 8:** డ్రైవర్లు రహదారి నియమ నిబంధనలు పాటించాలని కోదాడ డీఎస్పీ ప్రకాష్ అన్నారు. 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు సిగ్నల్‌ను అతిక్రమించవొద్దన్నారు. రోడ్డుపై పార్కింగ్ చేసేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ పత్రాలు, లైసెన్సులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ రాము, ట్రాఫిక్ ఎస్ఐ రాంబాబు, పట్టణ ఎస్ఐలు రామాంజనేయులు, యాదవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**తిరుమలగిరి:** ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ కె. సత్యనారాయణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. బండి వెంట పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. మండలంలో గంజాయి వాడకం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**అనంతగిరి:** రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు ఎస్ఐ ఎం. అనిల్‌రెడ్డి అవగాహన కల్పించారు. తప్ప



కోదాడలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రకాష్

నిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను యూనిఫామ్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

**గరిడేపల్లి:** గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్ఐ పి.వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని పొనుగోడు, కీతవారిగూడెం, రాయినిగూడెం గ్రామాల్లో ప్రజలకు మత్తు పదార్థాలతో వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి డ్రగ్స్ వాడటం, రవాణా నిర్వహించిన చట్టరీత్యా నేరమన్నారు. నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పిల్లలు పెద్దలు ఎవరైన వాటికి అలవాటు పడటం వలన సంభవించే అనర్థాలు గురించి వివరించారు.

## బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



కెనరా బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఏజీఎం శాంతికుమార్

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 8:** ప్రభుత్వ రంగ సంస్థ కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ వరంగల్ రీజనల్-1 అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శాంతికుమార్ కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్‌ను గురువారం ప్రారంభించారు. వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రతిరోజూ గోల్డ్ రుణాలు అందిస్తున్నామన్నారు. కెనరా బ్యాంక్ అన్ని వర్గాలకు చేయూతనందిస్తుందన్నారు. వాహనాలు, ఇళ్లు, బిజినెస్ రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఫణీందర్‌కుమార్, మాజీ సర్పంచ్ గొట్టె వెంకట్రామయ్య, కల్వకొలను వెంకటవరప్రసాద్, కల్వకొలను సుధాకర్, సాముల శివారెడ్డి, గజ్జి ప్రభాకర్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, మేనేజర్ సత్యంబాబు, అసిస్టెంట్ మేనేజర్ హరి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ డే సెలబ్రేషన్స్‌కు ఎంపిక

**చిలుకూరు, ఫిబ్రవరి 8:** తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌డే సెలబ్రేషన్స్‌లో మండలంలోని బేతవోలు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నందిని రాష్ట్రస్థాయి సైన్స్ డే సెలబ్రేషన్స్‌కు ఎంపికైంది. 'సేవ్ వాటర్' అనే అంశంపై ఇచ్చిన పేపర్ ప్రజంటేషన్‌లో జిల్లాస్థాయిలో తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌యం తేజోరాం, సైన్స్ టీచర్ చందా శ్రీనివాస్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న హైద్రాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెలబ్రేషన్స్ ఈ కార్యక్రమంలో విద్యార్థిని నందిని పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థిని నందినిని అభినందించారు.



విద్యార్థిని నందినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## స్థాయిని మించి సీఎంపై విమర్శలు తగవు

**తుంగతుర్తి, ఫిబ్రవరి 8:** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్థాయిని మించి చేస్తున్న వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని లూటీ చేసి అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. ఓటమిని జీర్ణించుకోలేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీమంత్రి జగదీష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు, ఓరుగంటి సత్యనారాయణ, కొండ రాజు, ఉప్పుల రాంబాబు, రామడుగు నవీన్, కుంచాల ప్రవీణ్‌రెడ్డి, ఎండి అబ్దుల్, అక్కినపల్లి నరేష్, గుగులోతు భాస్కర్, దేవరపు రమేష్ పాల్గొన్నారు.

**సూర్యాపేటటౌన్:** సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకుడు బాల్కసుమన్‌కు లేదని కాంగ్రెస్ జిల్లా నాయకులు కొండగడుపుల సూరయ్య అన్నారు. జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బాల్క సుమన్ తన ఉనికిని కాపాడుకోవడంకోసం, మాజీ సీఎం కేసీఆర్ మెప్పు పొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు పెద్ద పాలేరుగా మారిన బాల్కసుమన్ తనస్థాయి మరిచి మాట్లాడితే లక్షలాది మంది ప్రజలు చెప్పులతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని పక్కదారి పట్టించేలా ప్రజలను మభ్యపెట్టేందుకు కృష్ణాజలాల డ్రామాకు మాజీ సీఎం కేసీఆర్ తెరలేపారని ఆరోపించారు.

**మఠంపల్లి:** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యాలను వెనక్కి తీసుకోవాలని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఈశ్వర్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవడంతో బాల్క సుమన్ సహనం కోల్పోయి నోరు పారేసుకున్నారని, చెప్పు దెబ్బల రుచి ఏమిటో చూపిస్తామన్నారు. నోరు అదుపులో పెట్టుకొని బాల్క సుమన్ భేషరతుగా సీఎంకు క్షమాపణ చెప్పాలన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

**గరిడేపల్లి, ఫిబ్రవరి 8:** ఆరోగ్యమే మహాభాగ్యమని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య భారతి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.సీ రంగాచార్యులు అన్నారు. ఆరోగ్య పరిరక్షణపై మహిళలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులకు మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిత్యం మనం ఎన్నోరకాల జబ్బులకు, అనారోగ్య పరిస్థితులకు గురవుతున్న సందర్భంలో రోజు రోజుకు పెరుగుతున్న అల్లోపతి వైద్యాన్ని అందుకోలేని పరిస్థితుల నుంచి ప్రజలను, రోగ పీడితులను రక్షించి ఆరోగ్యంగా ఉండడానికి, జబ్బులు రాకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు మన దినచర్యలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి. నరేష్, శాస్త్రవేత్తలు ఏ. కిరణ్, టీ. మాధురి, ఏ. ఆదర్శ్, ఎన్. సుగంధి తదితరులు పాల్గొన్నారు.

## మోహన్‌సాయికి సన్మానం



మోహన్‌సాయిని సన్మానిస్తున్న సంపత్‌రెడ్డి

**హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 8:** భారతదేశం నుంచి అన్‌లాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కు ఎంపికైన హుజూర్‌నగర్‌కు చెందిన ఆకుల మోహన్‌సాయికి గురువారం 3వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ మోహన్‌సాయి ఆస్ట్రోనాట్ మిషన్‌కు రెండోసారి ఎంపికవ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. పేద కుటుంబానికి చెందిన మోహన్‌సాయి అన్‌లాగ్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కోతి లింగారెడ్డి, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో మేకలు మేపినందుకు బాలుడిపై దాడి

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 8:** పొలంలో మేకలు మేపాడని బాలుడిపై దాడి చేశారు. ఈ సంఘటన మండలంలోని చిమిర్యాల గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అల్లిక లక్ష్మి కుమారుడు సంతోష్ మేకలు తోలుకుని పొలం వద్దకు వెళ్లాడు. ఆ మేకలు పొలంలోకి వచ్చాయని పొలం యజమానులు గార్లపాటి గోపి, శంకరయ్య బాలుడిపై దురుసుగా ప్రవర్తించి కర్రలతో దాడి చేశారని తల్లి లక్ష్మి గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సంక్షిప్త సమాచారం..

**సూర్యాపేటటౌన్, అనంతగిరి:** అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో అంగన్‌వాడీకేంద్రంలో ప్రెషర్‌కుక్కర్ పేలిన ఘటనలో గాయాలపాలైన బాలుడు నీలం అబినవ్ కుటుంబానికి మంత్రి సీతక్క ఆర్థిక సాయం అందజేశారు. జిల్లాకేంద్రంలోని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో మంత్రి సీతక్క తరుపున బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 10వేల నగదు ఇటీవల అందజేశారు. బాలుడికి ఉచితంగా మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుదని తెలిపారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి బాలుడిని పరామర్శించి రూ. 20వేలు అందించారని తెలిపారు. ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతగిరిలో జరిగిన కార్యక్రమంలో అనంతగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కోదాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునుకుల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామానాయక్, బాబునాయక్, నాగుల్ మీరా, బుర్రా పుల్లారెడ్డి, ఈదుల క్రిష్ణయ్య, డేగ కొండయ్య, బుర్ర నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నూతన్‌కల్:** మండల పరిధిలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు చల్లా తేజ ఆర్థిక సాయంతో కాంగ్రెస్ నాయకులు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, లింగాల రామచంద్రయ్య, అనంతుల నాగలింగం, ఎర్రోజు కృష్ణయ్య, హెచ్ఎం ఉయ్యాల ప్రసాద్, మహేశ్వరం వెంకటయ్య, రావుల హన్మంత్, కొంగల నరేష్, మహేష్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ రూరల్:** సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కోదాడ సీపీఎం నాయకులు గురువారం కలిశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన తమ్మినేని వీరభద్రం హైద్రాబాద్ నుంచి ఆరోగ్యంగా తిరిగి వచ్చిన సందర్భంగా ఖమ్మం జిల్లా తెల్లారిపల్లిలో కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ఎం. ముత్యాలు, షేక్ సైదా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మఠంపల్లి:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారాలతో తండాల అభివృద్ధికి కృషిచేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో కొత్త దొనబండతండాలో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయబాలనాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోముడు, నవీన్‌నాయక్, భాస్కర్‌నాయక్, కిషన్‌నాయక్, కోటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**మద్దిరాల:** కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌కు భువనగిరి పార్లమెంట్ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి అన్నారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన వెంకన్నయాదవ్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు నలమాస ఉపేందర్, లింగయ్య, ఖాశీం, సోమయ్య, వెంకటయ్య, నారాయణ పాల్గొన్నారు.

**అర్వపల్లి:** మండలంలోని తిమ్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత ఇమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాని వీరయ్య కంప్యూటర్ ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీడి బిక్షం, రత్నం లక్ష్మాజీ, పాలెల్లి సురేష్, వేములకొండ ఉప్పలయ్య, నిమ్మల ఎల్లయ్య, వెంకటనర్సు, రవి పాల్గొన్నారు.

**మేళ్లచెర్వు:** మాస శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మాస కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామునే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, నిర్వహించి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, స్వామివారి కల్యాణ ఘట్టం నిర్వహించారు. అనంతరం ఇష్టకామేశ్వరి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి, నర్సింహారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

**నేరేడుచర్ల:** నేరేడుచర్ల స్పందన జూనియర్ కళాశాలలో, చిల్లేపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఇంటర్, ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు పాటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్టా ప్రవీణ్‌రెడ్డి, గురుకుల పాఠశాలలో ఎంఈవో ఛత్రునాయక్, ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, మాజీ సర్పంచ్ బూచిపల్లి వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, రేణుక వార్డెన్ పాల్గొన్నారు.

**నాగారం:** రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు బిక్కి శ్రీనివాస్, కౌన్సిలర్ జితేందర్ ఆధ్వర్యంలో నాగారం, తిర్మలగిరి మండల కాంగ్రెస్ నాయకులు మంత్రిని కలిశారు. తుంగతుర్తి నియోజకవర్గ కార్యకర్తలకు అండగా ఉంటానని మంత్రి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి శ్రీనివాసు, రాము, భాస్కర్, యాకస్వామి పాల్గొన్నారు.

**కోదాడ రూరల్:** మండలంలోని తమ్మర శ్రీషిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, మధ్యాహ్నం 12 గంటలకు కాకడ హారతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రాము, కీర్తన, భక్తులు పాల్గొన్నారు.

**కోదాడ రూరల్:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీపీ మల్లెల రాణి కోరారు. మండలంలోని గుడిబండ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. అనంతరం కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న వైద్యం సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ, గుడిబండ దేవాలయ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, బ్రహ్మయ్య, శ్రీనివాసరెడ్డి, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.